క్లుప్తంగా

వారధిపై వర్షపు నీరు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

దాచేపల్లి: కృష్ణానది బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీటిని గురువారం తొలగించారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'నిలిచిన వర్షపు నీరు.. రాకపోకలకు ఇబ్బందులు' శీర్షికన కథనాన్ని సాక్షి దినపత్రికలో గురువారం(9వ తేదీ) ప్రచురితమయింది. ఈ కథనానికి తహసీల్దార్ కె.శ్రీనివాస యాదవ్ స్పందించారు. కృష్ణానది బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ రెవెన్యూ అధికారి బైరపొగు యలమంద, పంచాయతీ కార్యదర్శి గుండ్రెడ్డి కోటేశ్వరరావు బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలించి, పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగింపజేశారు. సాక్షి కథనానికి స్పందించి బ్రిడ్జిపై వర్షపు నీటిని తొలగించటం పట్ల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం: ఎద్దు పొడవడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కంపా వెంకటేశ్వర్లు (59) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న కనిగిరి శ్రీను పొలంలోని దేవాలయ ప్రాంగణంలోని తోటలో ఎద్దులకు నీళ్ల తాగించేందుకు వెళ్లగా ఎద్దు పొడవడంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య సీతారావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రెంటచింతల: గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో పోలీసు సిబ్బందితో దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. తెలంగాణ మద్యం అమ్మడం, సరఫరా చేయడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మీ ప్రాంతంలో అసాంఘిక చర్యలు జరగకుండా ఉండాలంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నివారణలో పోలీసు సిబ్బందితో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

యడ్లపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అత్యాచార యత్నంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని క్షేత్రస్థాయి విధుల్లో ఉండగా గ్రామానికి చెందిన జాజుల పెదతిరుపతయ్య అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. దీంతో సమీపాన ఉన్న మహిళలు వచ్చి అతన్ని మందలించి పంపించేశారు. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శివరామకృష్ణ తెలిపారు. అత్యాచారయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయ ఉద్యోగినిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన జాజుల పెదతిరుపతయ్యను అదుపులోకి తీసుకున్నామని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు. ఎస్సై టి.శివరామకృష్ణతో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయా వివరాలను వెల్లడించారు.

సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా

నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లోకనాథం తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి లేని వాహనాలు రోడ్లపైకి తీసుకురావద్దని సీఐ కోరారు. వాహనదారులు విధిగా పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నిబంధలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు వేణు, రాజా, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర యాప్‌లు బహిష్కరిస్తున్నాం

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య



ఎంఈవో సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మాచర్ల రూరల్: మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతుందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటంలో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో అల్లి సురేష్‌కు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని, ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన ధర్నాలో ప్రభుత్వానికి తెలిపామని, 10 నుంచి బోధనేతర పనులను పూర్తిగా బహిష్కరిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పనులు, మూల్యాంకనానికి సంబంధించిన పనులు తప్ప బోధనేతర పనులను చేయమని స్పష్టం చేశారు. గుగూల్ షీటు నింపటం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 లాంటి ప్రచార కార్యక్రమాలు చేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె.కృష్ణారావు, తాటి రాజశేఖర్, ఎ.నాసర్‌రెడ్డి, రామారావు, జబ్బార్, కేశవరెడ్డి తదితరులున్నారు.

సీఐటీయూ మూడవ మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ సీనియర్ నాయకులువిజయ్‌కుమార్

పిడుగురాళ్ల: సీఐటీయూ మూడవ మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకులు జి.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో ఉన్న కన్నెగంటి హనుమంత్ భవనంలో గురువారం సీఐటీయూ నాయకురాలు డి.శాంతమణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా సీఐటీయూ మూడవ మహాసభలు పిడుగురాళ్ల పట్టణంలో ఈ నెల 25, 26 తేదీలలో జరగనున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను బికారులుగా చేసే విధానాలు అవలంబిస్తుందని, దీనిలో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 వేతన కోడ్లు తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. కార్మికులపై పని భారం పెంచే విధంగా 8 గంటల పని విధానానికి బదులుగా 10 గంటలు, 13 గంటలు పని చేయాలని నిర్ణయాలు చేయటం సిగ్గుచేటన్నారు. యజమానులకు పెట్టుబడి దారులకు లాభాలు చేకూర్చే విధానాలను అమలు చేయటం సిగ్గుచేటని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా తెలగపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా పి.శాంతమణి, అక్కమ్మ, రమణ, కంపా సాగర్‌బాబు, మణికంఠ, శేషుదాసు, మద్దిరాల నాగేశ్వరరావు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలు సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పంట పొలాలను పరిశీలిస్తున్న హెచ్‌వో అంజలి భాయ్

మాచవరం: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని హెచ్‌వో ఎం.అంజలి భాయ్ తెలిపారు. మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామాలలో సూపర్ చెక్ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలను పరిశీలించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వ సహాయం, ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆమె తెలిపారు. అలాగే అధిక వర్షాల సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అరటి, బొప్పాయి తోటల్లో గాలికి చెట్లు పడిపోకుండా కర్రలతో ఊతం ఇవ్వాలన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు చేసుకుని నీటిని బయటకు పంపాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన వేరుకుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ లేదా రిడొమిల్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు ఎక్కువ చేరడం వలన మొక్కలు భూమి నుంచి పోషకాలు తీసుకోక, ఆకులు పసుపు రంగుకి మారి మొక్కలు చనిపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హనుమంతు నాయక్, ప్రభాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ ఫణికుమార్



జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సులో అధ్యాపకులు తదితరులు



జీఎస్టీ తగ్గుదల కరపత్రాలను చూపుతున్న ఆరోగ్య సిబ్బంది తదితరులు

రెంటచింతల: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలలో భాగంగా అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎం.ఫణికుమార్ కోరారు. గురువారం పీహెచ్‌సీ నుంచి గ్రామ పురవీధులలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని చేపట్టి మాట్లాడారు. జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా గతంలో మందులపై 12 శాతం ఉన్న జీఎస్టీ ప్రస్తుతం కొన్ని మందులపై 5 శాతం మాత్రమే ఉందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు కారణంగా ప్రతి కుటుంబానికి ఏడాదికి సుమారు రూ.15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఏడీ శర్మ, ఎ.ఆంజనేయులు, మలేరియ ఆరోగ్య పరవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు, హెచ్‌వీ లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్లు ఖాసింసా, విజయలక్ష్మి, ఎల్‌టీ దుర్గారావు, ఆరోగ్య సిబ్బంది మౌనిక, హెచ్‌పీ నరేష్, సులోచన, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు

మాచర్ల రూరల్: దేశ చరిత్రలో పెంచిన పన్నులను తగ్గించి నాలుగు దఫాలుగా శ్లాబు రేట్లను విభజించటం వలన సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తుమ్మేపల్లి సాంబశివరావు అన్నారు. గురువారం చక్రధర్ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0పై సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ 2.0 వలన మెడికల్, కిరాణా, ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు జీవిత భద్రత కోసం చేసుకునే బీమా చెల్లింపుల్లోనూ తగ్గింపు రావటం సంతోషకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.మహేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు జక్కా గురవయ్య పాల్గొన్నారు. అనంతరం జీఎస్టీపై జరిగిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులు ఆదర్శనీదేవి, కౌశిక్ నాయక్, లక్ష్మణ్ నాయక్, షేక్ సమీరా, నరసింహారావు, శ్రావణి, లక్ష్మిలకు బహుమతులు అందజేశారు.

ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై అవగాహన

పిడుగురాళ్ల: పట్టణంలోని సంజీవరెడ్డినగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పన్ను చెల్లింపునకు చేసిన సవరణలో భాగంగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన పలు రకాల మందులు, వ్యాధి నిర్ధారణ చేసే పరికరాలపై పాక్షికంగా, పూర్తిగా పన్నులను తొలగించిందని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణశాస్త్రి తెలిపారు. అలాగే ప్రజల జీవిత, ఆరోగ్య బీమాకు సంబంధించి వాటిపై పన్నులు కూడా పూర్తిగా తొలగించటం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి నిర్ణయాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య కేంద్రాలలో నూతన జీఎస్టీ 2.0 ద్వారా పన్నులు పూర్తిగా తొలగించటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, పట్టణంలోని ఫార్మసీ యజమానులు, జీవిత బీమా ఏజెంట్లు, ఆడిటర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో సామాజిక తనిఖీలు ముగిసాయి. 17వ విడత సామాజిక తనిఖీలలో 33 గ్రామ పంచాయతీల్లోని పనుల తనిఖీ చేపట్టి గ్రామ సభలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలో ప్రజావేదికతో ముగించారు. 33 పంచాయతీల్లో 841 పనులకు రూ.15.76 కోట్ల నిధులు వెచ్చించారు. 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో రూ.2.46 కోట్ల మేర నిధుల దుర్వినియోగం, అక్రమాలు ఉన్నట్లు గుర్తించారు. ఏపీవో ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా వేదికలో రూ.3.05 లక్షలు రికవరీ, రూ.29 వేలు పెనాల్టీ, రూ.88.14 లక్షల పనులను విచారణ నిమిత్తం, రూ.37.43 లక్షల పనులను తిరిగి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని లేకుంటే రికవరీ ఉంటుందని పీడీ ఆదేశించారని తెలిపారు. అక్రమాలు భారీగా వెలుగు చూసినప్పటికీ ప్రజావేదికలో బహిర్గతం కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

దాచేపల్లి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన జంగాల సుధాకర్ బాబు (20) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు గురువారం తెలిపారు. ఇంట్లో జరిగిన చిన్న పాటి ఘర్షణ కారణంగా గురువారం తెల్లవారుజామున సుమారు 2.15 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదని, తండ్రి బ్రహ్మయ్య బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో తండ్రి కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమని ఎస్సై పాపారావు వెల్లడించారు.

ఘనంగా అట్లతద్ది వేడుకలు



పిడుగురాళ్ల: అట్లతద్దిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత పోస్టాఫీస్ బజారులో చిన్నారులు, మహిళలు ఊయలలు ఊగుతూ అట్లతద్ది వేడుకలు జరుపుకున్నారు. ఇచ్చినమ్మ వాయనం... పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ వాయనాలను అందించారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు, మహిళలు ఊయలలు ఊగి అట్లతద్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అమలులో లేని పథకాలకు దరఖాస్తు చేయవద్దు

తహసీల్దార్ మధుబాబు




పిడుగురాళ్ల: అమలులో లేని పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవద్దని తహసీల్దార్ మధుబాబు గురువారం తెలిపారు. పట్టణంలో ఇంటర్‌నెట్ షాపుల ద్వారా, మీ సేవల ద్వారా ప్రధానమంత్రి జాతీయ కుటుంబ హామీ పథకం అమలులో ఉందంటూ అర్జీలు విక్రయించడంతో.. పలువురు ఆ అర్జీలు పూర్తి చేసి తహసీల్దార్ కార్యాలయానికి పంపిస్తున్నారని, ఈ పథకం ప్రస్తుతం మన ప్రాంతంలో అమలులో లేదని, దానికి సంబంధించి ఎటువంటి నియమ నిబంధనలు రాలేదన్నారు. ఇటువంటి దరఖాస్తులు చేసుకోవద్దని ఆయన సూచించారు. మీ సేవ, ఇంటర్‌నెట్ నిర్వాహకులు అమలులో లేని పథకాలకు దరఖాస్తులు విక్రయించినా, అమాయక ప్రజలను మోసం చేసినా, వారి వద్ద నగదు తీసుకుని మోసం చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ములకలూరు గ్రామ పరిధిలో ఆక్రమణలో ఉన్న వాగు పోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్యమాదిగ, మాల మహానాడు నాయకుడు మద్దాల రమేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో 4 ఎకరాల వాగు పోరంబోకు భూమిని కొంత కాలంగా మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామి సాగు చేస్తున్నాడని, ఈ భూమిని నిరుపేదలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. వాగు పోరంబోకు భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

20 నిమిషాల్లో చైన్ స్నాచర్స్ అరెస్ట్



నరసరావుపేట రూరల్: పోలీసులు సకాలంలో స్పందించడంతో చోరీకి గురైన బంగారం 20 నిమిషాల వ్యవధిలోనే బాధితురాలికి అందింది. ఈ ఘటనలో ఇద్దరు చైన్ స్నాచర్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఇస్సపాలెం గ్రామానికి చెందిన ఎ.సులోచనమ్మ గురువారం మెయిన్‌రోడ్డులో ఆటో దిగి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలోని బంగారు గొలుసును దోచుకెళ్లారు. సులోచనమ్మ కేకలు వేయడంతో యువకులు పరారయ్యారు. బాధితురాలు వెంటనే 100కు ఫోన్ చేయడంతో రూరల్ ఎస్సై కిషోర్ స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి పోలీసు స్టేషన్‌లో గొలుసును అందజేశారు. ట్రైనీ ఎస్సై వలి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ బాబు దీక్షకు మద్దతుగా ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

రొంపిచర్ల: దళిత యువకుడు సాగర్ బాబు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా గురువారం ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోట నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కోట నాయక్ మాట్లాడుతూ కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఏఈ కోటేశ్వరరావు, ఎల్ఐ ఓంకార్, ఎల్ఎం వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ పరబ్రహ్మాచారి, విద్యుత్ నిలుపుదల చేయకుండానే స్తంభం ఎక్కించి సాగర్ బాబును వికలాంగుడిగా మార్చారన్నారు. దీనిపై తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకుని, సాగర్ బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కేవీ ప్రసాద్, సీఐటీయూ నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు, పౌరహక్కుల సంఘం నాయకులు మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



మండల స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం దుర్గాప్రసాద్, పీఈటీలు



కబడ్డీ పోటీలో బాలురు



కబడ్డీ పోటీలో బాలికలు



స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు

రెవ. ఫాదర్ గోవిందు బాలస్వామి

రెంటచింతల: విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని అప్పుడే ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రెవ.ఫాదర్ గోవిందు బాలస్వామి అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెంటచింతల మండల స్థాయి అండర్-14, 17 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలలో సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన విశేష ప్రతిభ కనబరిచిన 26 మంది బాలబాలికలను మండల స్థాయి జట్లకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు ఆటలలో కూడా ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని దీంతో వారు ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, పీఈటీలు కత్తి రవి, బ్రహ్మయ్య, కె.సురేష్, విద్యాసాగర్, సుభాని, ఉపాధ్యాయులు ఎస్.కమల, పాపారావు, శ్రీనివాసరావు, జయపాల్‌రెడ్డి, శౌరయ్య, సుధాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. పట్టణం, మండలంలోని సుమారు 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 650 మందికి పైగా పాల్గొన్నారు. ఈ పోటీలలో అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 600 మీటర్ల విభాగంలో అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. లాంగ్ జంప్, షాట్ పుట్, చెస్, యోగా, షటిల్, కబడ్డీ, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. మండల స్థాయికి జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఆడనున్నారని, అక్కడ గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో ఆడతారని వ్యాయామ ఉపాధ్యాయులు దయాకర్ తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటల పోటీలలో సెయింట్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మేరి పద్మజ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అండర్-17 విభాగంలో వి.ప్రవళిక వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరించిందని, అండర్-14 విభాగంలో వి.కేశవ వాలీబాల్, రన్నింగ్‌లో ప్రతిభ కనబరిచాడని, సీనియర్ విభాగంలో ఖోఖోలో సతీష్, సీహెచ్ రాజేష్, పి.ఆనంద్‌బాబు, కె.ఎతిక్, చెస్‌లో జి.చాణక్య, కె.చైతన్య, రన్నింగ్‌లో రాంబాబు, రాజు సెలెక్ట్ అయ్యారని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మేరి పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పల్నాడు దైవ సేవకుల నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన సేవకుల నూతన కమిటీ సభ్యులు

మాచర్ల రూరల్: పల్నాడు దైవ సేవకుల సహవాసం నూతన కమిటీ ఎంపిక చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు జాన్‌వెస్లీ తెలిపారు. గురువారం స్థానిక చెన్నకేశవనగర్ కాలనీ హౌస్ ప్రేయర్ చర్చిలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్టర్ రాజారావు హాజరవ్వగా, వ్యవస్థాపక ఉపాధ్యక్షులు ఎలీషా దైవ సందేశం అందించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సుందరరావు, కార్యదర్శిగా జాషువ, ట్రెజరర్‌గా లాజర్, సహాయ కార్యదర్శిగా డేవిడ్ రాజు, కార్యవర్గ సభ్యులుగా సిలువరాణి, పీటర్ పాల్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఏసుక్రీస్తు సందేశాలను మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం అందించి వారిని శాంతి, సమానత్వం వైపు పయనించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10 కేజీల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం.. రూ.2,500 జరిమానా



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

నరసరావుపేట: పట్టణంలో పర్యావరణాన్ని కాపాడటంలో అందరూ బాధ్యత వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పల్నాడు రోడ్డు, మల్లమ్మ సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్లలో ప్లాస్టిక్‌పై వ్యాపారులకు అవగాహన కల్పించారు. కిరాణా షాపులు, జ్యూస్ పాయింట్లు, తోపుడు బండ్లు, పండ్ల దుకాణాలను తనిఖీ చేశారు. పర్యావరణానికి హానికరంగా పరిణమించిన 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం గల 10 కేజీల ప్లాస్టిక్ వస్తువులు, గ్లాసులు, కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులకు రూ.2,500 వరకు జరిమానా విధించి ఆ సొమ్మును మున్సిపల్ ఖాతాకు జమచేశారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులను జిందాల్ విద్యుత్ ప్లాంట్‌కు పంపిస్తామన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ ఆకస్మికంగా పట్టణంలో పలుచోట్ల రైడింగ్ నిర్వహిస్తామన్నారు. వ్యాపారులు వినియోగదారులను పర్యావరణ హితమైన వస్తువులను వాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. పట్టణ ప్రజలు స్వచ్ఛ నరసరావుపేటకు సహకరించాలని కోరారు.